బడిబాటను విజయవంతం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మకమైన విద్యలభిస్తుందని, దీంతో పాటు క్రమశిక్షణ, దేశ భక్తికి, ఈ పాఠశాలలు నిలయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి క్రమశిక్షణను పెంపొందించుకోవాలని సూచించారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక పాఠశాలల సంయుక్త ఆధ్వర్యంలో డివిజన్‌లోని బీమామైదాన్ వాంబే కాలనీ వద్ద బడిబాటను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, బడీడు పిల్లలను తల్లిదండ్రులు పనులకు పంపించకుండా వారిని కష్టపడి చదివిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమవుతుందన్నారు. బడిబాటను విజయవంతంచేసి ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, నగరనాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, కరికె కిరణ్, శంకర్, హైస్కూల్ హెచ్ఎం మీనా కుమారి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం టి.పావన, ఉపాధ్యాయులు బి.వంశీ, డి.వీణ, వసంత, మమత, శిరీష, శైలజ, కె.స్వప్న, అనిల్‌కుమార్, సంధ్య, నాగయ్య, హేమతోపాటు పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో జోరుగా బడిబాట

ముషీరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో జోరుగా కొనసాగుతున్నది. జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమాన్ని వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ బడీడు పిల్లలను డ్రాప్ ఔట్‌లను గుర్తించి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పే విధంగా కృషిచేస్తున్నారు. సోమవారం ఇంటింటి ప్రచారాన్ని ముషీరాబాద్‌లో నిర్వహించారు. ఉపాధ్యాయులు చిన్నారులను, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను వివరించారు.



ముషీరాబాద్‌లో బడిబాట కార్యక్రమంలో పిల్లల వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు అరుణ, తదితరులు

మండలపరిధిలో 19 వరకు బడిబాట



బడిబాటను ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో ఈనెల 19 వరకు నిర్వహిస్తాం. ఇప్పటివరకు ప్రాథమిక పాఠశాలల్లో 17మంది, ఉన్నత పాఠశాలలో 12మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచే విధంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం.

- శ్రావణ్ కుమార్, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో

ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితమే



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్నం భోజనం తదితర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నాం. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వడంతోపాటు ఏఐ, డిజిటల్ క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కృషిచేస్తున్నాం.

- స్వరూపారాణి, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయండి

నల్లకుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలను బలోపేతంచేయాలని, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శులు ఎస్‌వీ.శ్రీకాంత్, పి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలలో సమస్యలు పరిష్కరించి వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి: డీఎస్పీ

కవాడిగూడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం 2009ని పటిష్ఠంగా అమలు చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థలలో 25శాతం సీట్లను నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కేటాయించాలని ధర్మసమాజ్ పార్టీ కో కన్వీనర్ గుడపర్తి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలోని రిజర్వేషన్‌సీట్లను అమలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సోమవారం ముషీరాబాద్ మండల డిప్యూటీ డీఈఓను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ ప్రతినిధి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ పోస్టర్ ఆవిష్కరణ

నల్లకుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టీయూసీఐ కార్మిక సంఘం దేశంలోని 14 రాష్ట్రాలలో కార్మిక ఉద్యమాలను, సంఘాలను నిర్వహిస్తున్నదని, బడా కార్పొరేట్ కంపెనీల యూనియన్ వర్కర్లను చైతన్యవంతులను చేస్తూ అనేక సమస్యలు పరిష్కరిస్తున్నదని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్.పద్మ, వి.ప్రవీణ్ వెల్లడించారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర టీయూసీఐ ప్రథమ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21, 22వ తేదీల్లో నిజామాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర టీయూసీఐ ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కృష్ణకాలనీ పార్కు సుందరీకరణను కాపాడాలి

ముషీరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ కృష్ణకాలనీ పార్కు సుందరీకరణను కాపాడాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు శ్రీకృష్ణ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతిపత్రం అందజేసింది. సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి, సీపీఎం పార్టీ నాయకుడు అజీజ్‌పాషా తదితరులు జోనల్ కమిసనర్‌ను కలిసి సమస్యలను వివరించారు. పార్కు పక్కనే చెత్తాచెదారం వేయడం వల్ల అపరిశుభ్రంగా మారుతోందని, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని ఫిర్యాదు చేశారు. పార్కు ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చే సందర్శకులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పార్కు వద్ద చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రకళకు డాక్టరేట్ ప్రదానం



చిక్కడపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డా.పంగులూరి చంద్రకళకు అనురాగ్ యూనివర్సిటీవారు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు. గణితశాస్త్ర విభాగంలో డా.వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్టడీ ఆఫ్ ఎంహెచ్‌డీ కన్వెక్టివ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఫ్లో ఆఫ్ హైబ్రీడ్ నానో ఫ్లూయిడ్స్ అనే వినూత్న అంశంపై చంద్రకళ పరిశోధన చేశారు. ఈ పరిశోధన ఇంజనీరింగ్ రంగంలో ముఖ్యంగా సౌరశక్తి, వేడి తగ్గించే పరికరాల తయారీ వంటి వాటిలో గణనీయమైన ప్రయోజనాలను కలిగి ఉందని డా.చంద్రకళ తెలిపారు. ఈ అధ్యయనం వైద్యరంగంలో కూడా ఉపయోగకరంగా ఉంటుందని ఆమె వివరించారు. ఈ వినూత్న పరిశోధన చంద్రకళ కృషి, అంకితభావానికి నిదర్శనమని, ఆమె పరిశోధనా దృక్పథం శాస్త్రీయ వర్గాల నుంచి ప్రశంసలు అందుకుందని విశ్వవిద్యాలయం పేర్కొనట్లు ఆమె వెల్లడించారు.

యువ మోర్చా డివిజన్ అధ్యక్షుడిగా రాఘవేంద్రచారి



రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ యువ మోర్చా బాగ్‌అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా వజ్రోజు రాఘవేంద్రచారి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాగరాజుచారి సోమవారం ప్రకటించారు.

బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ కార్యదర్శిగా బాల్‌రాజ్



రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ కార్యదర్శిగా సంగం బాల్‌రాజ్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ ప్రకటించారు.

బీజేపీ అంబర్‌పేట డివిజన్ నూతన కమిటీ ఏర్పాటు

అంబర్‌పేట, జూన్9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అంబర్‌పేట డివిజన్ నూతన కమిటీని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ప్రకటించారు. ప్రధానకార్యదర్శులుగా లక్ష్మణ్, శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా తిరుపతిగుప్తా, మహేష్, వినోద్‌యాదవ్, నరసింహగౌడ్ కార్యదర్శులుగా శోభ, పద్మ, శ్రీనివాస్, దేవయ్య, కోశాధికారిగా చంద్రమౌళిని నియమించినట్లు ఆయన తెలిపారు.

మంత్రివర్గంలో సామాజిక న్యాయం ఎక్కడ : టీడీపీ

రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యత గల పదవులను అగ్రవర్ణాలకు ఇచ్చి ప్రాధాన్యత లేని పోస్టులను బలహీనవర్గాలు, నిమ్నజాతులకు ఇవ్వడంలో సామాజిక న్యాయం ఎక్కడ ఉందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ప్రశ్నించారు. సోమవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం చేశామని సీఎం, కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీలో ఉన్న అసంతృప్తిని చల్లార్చేందుకు మాత్రమే ఈ మంత్రివర్గ విస్తరణ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్, భానుప్రకాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఎలక్ట్రిషియన్‌పై కత్తితో దాడి

బర్కత్‌పుర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జేబులో ఉన్న నగదు, సెల్‌ఫోన్ లాక్కోవడానికి దొంగలు ప్రయత్నించగా దానిని అడ్డుకున్న ఎలక్ట్రిషియన్‌పై కత్తితో దాడిచేసి పారిపోయారు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలోని యాకత్‌పుర రైల్వేస్టేషన్‌లో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... యాకత్‌పురకు చెందిన షేక్‌ఖదీర్(20) ఎలక్ట్రిషియన్. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో యాకత్‌పుర రైల్వేస్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు దిగి ఇంటికెళ్తుండగా ఆరుగురు దొంగల ముఠా అడ్డుకుంది. సెల్‌ఫోన్, జేబులో ఉన్న నగదు లాక్కోవడానికి ప్రయత్నించగా దానిని ప్రతిఘటించాడు. దీంతో ఓ దొంగ కత్తితో దాడిచేశాడు. ఈదాడిలో ఖదీర్‌కు ఛాతీ కింద గాయాలయ్యాయి. దొంగలు పారిపోయారు. అతన్ని వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఆస్పత్రికి వెళ్లి ఖదీర్ స్టేట్‌మెంట్‌ను సోమవారం ఉదయం రికార్డు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

బర్కత్‌పుర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి రైలులో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ దొంగను రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి, అతని నుంచి రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సరూర్‌నగర్‌లోని కామేశ్వర్‌రావుకాలనీకి చెందిన మహ్మద్ ఇబ్రహీం కుమారుడు అహ్మద్ మోహినుద్దీన్ అలియాస్ దావూద్ (27) వృత్తిరీత్యా సోఫాల రీపేరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడిన దావుద్ సెల్‌ఫోన్ దొంగతనాలను ఎంచుకున్నాడు. రైలులో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్ దొంగతనం చేసి తక్కువ ధరకు విక్రయించేవాడు. సోమవారం కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం 1లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా దావుద్ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అనుమానం వచ్చి పట్టుకుని వివరాలు అడుగగా తాను చేసిన సెల్‌ఫోన్ దొంగతనాలను ఒప్పుకున్నాడు. అతని నుంచి రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మూడు నెలల గడువు ఇప్పించండి

- వీహెచ్‌ను కలిసిన చిక్కడపల్లి మార్కెట్‌వాసులు
- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడిన వీహెచ్

చిక్కడపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తమకు మూడునెలల గడువు ఇప్పించాలని, తిరిగి తమ షాప్‌లు ప్రస్తుతం ఉన్నవిధంగానే అంతే స్థలంలో కేటాయించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడాలని వీహెచ్‌ను చిక్కడపల్లి మార్కెట్ వాసులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ మార్కెట్ సముదాయంలోని షాప్‌లవారు సోమవారం ఉదయం మాజీ ఎంపీ వి.హనుమంతరావును కలిశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అశోక్ కుమార్ సోమవారం మధ్యాహ్నం చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్‌లో మాట్లాడారు. 6 నెలల క్రితం మున్సిపల్ సర్కిల్-15 సెక్షన్ అధికారి, సిబ్బంది వచ్చి గ్రౌండ్‌ఫ్లోర్ లేఔట్‌ప్లాన్ ఇచ్చి వెళ్లారని వివరించారు. 'మా షాప్‌లు అన్నీ కూడా 21 బై 12 ఫీట్‌ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్లాన్‌లో మాత్రం 9 బై12 ఉన్నాయి. ఇది మా షాప్‌ల వారికి సమ్మతం కాదు. 9 అంతస్తుల నిర్మాణం అని చెప్పి గ్రౌండ్‌ఫ్లోర్ ప్లాన్ గీసి ఇచ్చారు. మాకు షాప్‌లు ఎలా అలాట్ చేస్తారు? ఏ విధంగా మాకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపుతారు? భవనం నిర్మించే వరకు మాకు తాత్కాలికంగా ఎక్కడ షాప్‌లు కేటాయిస్తారు? ఇలా చాలా డిమాండ్లు ఉన్నాయి' అని మాజీ ఎంపీ వీహెచ్‌కు వివరించామని తెలిపారు. ఈ విషయాన్నే గతంలో అప్పటి జీహెచ్ఎంసీ సర్కిల్ 15 డీఎంసీ ఖాజా మొయినుద్దీన్‌కు కూడా స్పష్టం చేశామన్నారు. అధికారికంగా ప్రతిపాదనను ప్రభుత్వం తీసుకొచ్చినప్పుడు 'మీ ప్రతిపాదనలు, డిమాండ్లు ఏమేమి ఉన్నాయో అప్పుడే చెప్పండి అని డీఎంసీ మాకు సూచించారు. అందుకే ఇప్పుడు తమ డిమాండ్లు వివరిస్తున్నాం'అనిఅన్నారు. ఉదయం మాజీ ఎంపీ వీహెచ్‌ను కలిసినప్పుడు ఆయన వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారని అశోక్‌కుమార్ వివరించారు.

వివేకానందనగర్ బస్తీవాసులకు ఇళ్లు కేటాయించాలి

నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనిరుధ్‌ను కోరిన ఎంపీ లక్ష్మణ్



బాధితుల సమక్షంలో మంత్రి, కలెక్టర్‌తో సంభాషిస్తున్న ఎంపీ డా.లక్ష్మణ్

చిక్కడపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు అతిత్వరలో ఇళ్ల కేటాయింపునకు చర్యలు తీసుకునేవిధంగా కృషి చేస్తామని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ కలెక్టర్ అనిరుధ్ దురిశెట్టి హామీనిచ్చారని ఎంపీ డా.కె.లక్ష్మణ్ బస్తీ నిర్వాసితులకు వివరించారు. స్వామి వివేకానందనగర్ బస్తీలోని 19 పేద దళిత కుటుంబాల ఇళ్లను రెవెన్యూ, జీహెచ్ఎంసీ వారు కూల్చివేసి, 15 నెలలు కావొస్తున్నా తమకు పునరావాసం కల్పించడం లేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తామని చెప్పినా ప్రభుత్వ అధికారులు ఇప్పుడు తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బస్తీవాసులు సోమవారం ఎంపీ. డా.కె.లక్ష్మణ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ చొరవతో బస్తీవాసులు లక్ష్మణ్‌ను కలిశారు. స్పందించిన లక్ష్మణ్ అప్పటికప్పుడు రవాణామంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనిరుధ్ దురిశెట్టితో ఫోన్‌లో మాట్లాడారు. నిరుపేద దళిత కుటుంబాలు ఇళ్లు కోల్పోయి 15 నెలలుగా నిరాశ్రయులుగా జీవిస్తున్నారన్నారు. కూల్చిన వెంటనే ఇళ్లు కేటాయిస్తామన్న ప్రభుత్వ అధికారులు ఇన్ని నెలలు గడుస్తున్నా ఎందుకు ఇళ్లు కేటాయించలేదని మంత్రిని, కలెక్టర్‌ను ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. పేదలకు న్యాయం జరిగేవిధంగా రాష్ట్రప్రభుత్వం వెంటనే డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి, కలెక్టర్ అతి త్వరలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిచేస్తామన్నారని లక్ష్మణ్ బస్తీవాసులకు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్‌పార్లమెంటు జాయింట్‌కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బస్తీవాసులు ఎంబీ.కృష్ణ, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, ఇందు, పద్మావతి, పూజరేఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్‌కుమార్, రాజిరెడ్డి తదితరులు

జలమండలి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జలమండలి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మిక కమిషనరేట్‌లో ట్విన్‌సిటీస్ జాయింట్ లేబర్ కమిషనర్ సునీతాగోపాల్‌దాస్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్, వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి మాట్లాడుతూ తక్షణమే జలమండలిలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌ల నేతలు ఎండి జహంగీర్, శ్రావణ్‌కుమార్, రాఘవేంద్రరాజ్, చంద్రశేఖర్, దేవేందర్, లక్ష్మణ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

విదేశాల్లో తెలుగువారి సాహితీ రచనలు అభినందనీయం

చిక్కడపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వివిధ దేశాల్లో ఉన్న తెలుగువారు సాహిత్య రచనలు చేయడం అభినందనీయమని కేంద్రమాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో వంశీ విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి స్వాతి జంగా(సింగపూర్) రచించిన సిరితలపుల శతకం ఆవిష్కరణ సభ జరిగింది. శ్రీపేరి పర్యవేక్షణలో జరిగిన ఈసభలో వంశీ ప్రవాస భారతీయ సాహితీ పురస్కారాన్ని స్వాతి జంగాకు అందించి సత్కరించారు. ప్రముఖ రచయిత్రి డా.కేవీ కృష్ణకుమారి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వేణుగోపాలచారి ప్రసంగిస్తూ ఆవిష్కృత పుస్తకంలో పద్యాలు పఠనీయంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ప్రముఖ రచయిత్రి డా.కేవీ.కృష్ణకుమారి, వాణి ఉప్పల, డా.తెన్నేటి సుధాదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

ముషీరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి ధర్మకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. సోమవారం భోలక్‌పూర్‌లోని దేవుని తోటలో గల 400 సంవత్సరాల చరిత్ర గల భవానీశంకర ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తల ప్రమాణస్వీకారం ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ఈవో జ్యోతి చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... ఆలయ కమిటీ ధర్మకర్తలు దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా కృషిచేయాలన్నారు. త్వరలో జరగబోయే బోనాల ఉత్సవాలను ఈ సంవత్సరం వైభవంగా నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్, ధర్మకర్తలు నర్సింగ్‌రావు, శ్వేత తదితరులు మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్, డివిజన్ అధ్యక్షులు పెండం శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్, జఫేర్‌ఉద్దీన్, టీపీసీసీ కార్యదర్శులు జీఎన్.కేశవ్, డి.వెంకటేష్, నియోజకవర్గం ఏ అండ్ బీ-బ్లాక్ అధ్యక్షులు వీడి కృష్ణ, అంజియాదవ్, లోకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



భవానీ శంకర ఆలయ కమిటీ చైర్మన్ సురేష్ కుమార్, ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఈవో జ్యోతి

ఆలయ కమిటీ ధర్మకర్తలు

భవానీశంకర ఆలయ నూతన కమిటీ ధర్మకర్తలు 16మందిని నియమించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా మేడి సురేష్‌కుమార్, ధర్మకర్తలుగా ఎం.శ్వేత, పి.నర్సింగ్‌రావు, సాయిబాబా, నీల్‌చందర్, సూర్యచంద్రశేఖర్, క్రాంతి, కె.పరమేశ్, లక్ష్మణ్, వై.పి.రాజు, మహేష్‌కుమార్, రాజు, తలారి నర్సింగ్‌రావు, సురేందర్, కిషోర్‌యాదవ్, రంజిత్‌గౌడ్‌ను నియమించారు. వీరి పదవీకాలం సంవత్సర కాలం పాటు ఉంటుందని ఈవో జ్యోతి తెలిపారు.

'ప్రజల కథే నా ఆత్మకథ'ను చదవాలి

రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ రాసిన ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఈ పుస్తకం ఆవిష్కరణ జరిగిన నేపథ్యంలో సోమవారం రాంనగర్‌లోని దత్తాత్రేయ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. దత్తాత్రేయను శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధిఖి, మేడి సత్యనారాయణ, కార్తీక్‌యాదవ్, వెంకటేష్, రాజేష్, మహేందర్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ 150 మీటర్లు నిర్మించాలి

రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల చిక్కడపల్లి నుంచి బాగ్‌లింగంపల్లి వెళ్లే మార్గంలో కూలిన హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీని 150 మీటర్ల పొడవున నిర్మించాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఇటీవల జరిగిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం నాలా పనులను చేపట్టారని ఆయన తెలిపారు. దీంతో పనులను స్థానికులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలి : కార్పొరేటర్

అంబర్‌పేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం నారాయణగూడలోని జలమండలి కార్యాలయంలో జీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో అంబర్‌పేట డివిజన్‌కు రూ.80 లక్షల అభివృద్ధి పనులు మంజూరు అయ్యాయన్నారు. అయినా పనులు ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ- 1 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. గగన్‌మహల్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని లోయర్‌ట్యాంక్‌బండ్, బరాఫ్‌బాగ్, సాధురామ్ కంటి ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు, దోమలగూడ పరిధిలోని మార్కెట్, జేబీ అపార్ట్‌మెంట్, శ్రీనివాస్ డౌన్ ఏరియా, ఈసేవ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డాక్టర్ రెడ్డిమల్ల పార్వతికి అవార్డు ప్రదానం

నల్లకుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వల్లూరి ఫౌండేషన్ సంస్థ కార్యదర్శి వల్లూరి శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి సినీ నటుడు, మాజీమంత్రి బాబుమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దళితరత్న అవార్డును తెలంగాణ రాష్ట్ర దళిత సేన మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతికి ప్రదానం చేశారు. ఇందుకు స్పందించిన డా.రెడ్డిమల్ల పార్వతి మాట్లాడుతూ ఈ అవార్డుతో తనలో మరిన్ని బాధ్యతలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో నూతన వీధీ దీపాల ఏర్పాటు

నల్లకుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని కుమ్మరవాడి, గజానంద్‌గడ్డ, పోచమ్మబస్తీ, భరత్‌నగర్ బస్తీల్లో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ అంధకారం రాజ్యమేలుతుందని బస్తీవాసులు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కెంచె మహేష్‌కుమార్ ఆ ప్రాంతాలను సందర్శించారు. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాల్లో నూతన వీధిదీపాలు, పలు చోట్ల మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఏడెల్లి శివ, బాలు పాల్గొన్నారు.

స్టీల్ వరల్డ్ ఔట్‌లెట్‌లో అగ్నిప్రమాదం

చిక్కడపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్‌లోని హిందుస్తాన్ స్టీల్ వరల్డ్ ఔట్‌లెట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. వీఎస్టీ ఆజామాబాద్‌లో మహ్మద్ ఇమ్రాన్ హిందుస్తాన్ స్టీల్‌వరల్డ్ ఔట్‌లెట్‌లో ఉదయం 5.30 గంటలప్రాంతంలో అగ్రిప్రమాదం జరిగింది. షాప్‌లో నుంచి దట్టమైన పొగలతో కూడిన మంటలు ఎగిసిపడడంతో స్థానికులు పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది 2 గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. బాధితుడు ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాచిగూడలో యువతి అదృశ్యం



సుమయా హుస్నా

బర్కత్‌పుర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. కాచిగూడ పీఎస్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. నెహ్రూనగర్‌కు చెందిన హర్షియ బేగం, సయ్యద్ ఖాదర్ కుమార్తె సుమయా హుస్నా(17) ఆదివారం రాత్రి స్నేహితురాలు షామీమ్‌తో కలిసి శివం రోడ్‌లోని ఖాజీమోహినుద్దీన్ పుట్టిన రోజు వేడుకలకు వెళ్లింది. తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తల్లి హర్షియ బేగం సోమవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాయదుర్గం పాఠశాల ఘటనపై చర్యలు తీసుకోవాలి

నల్లకుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలోని ప్రభుత్వ పాఠశాల ఘటనపై ప్రధానోపాధ్యాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కమిషనరేట్ ప్రాంగణంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ మహంతి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబు, రాజువస్తాద్‌లకు దళిత సంఘాల నేతలు వినతిపత్రం సమర్పించారు. జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు నేతృత్వంలోని ఓ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.